సాక్షి
వికారాబాద్
శుక్రవారం ; 23 ; ఫిబ్రవరి ; 2024



భవనం పూర్తయ్యేనా?
తాండూరులో విద్యా సౌకర్యాలు కొరవడ్డాయి. ఉన్నత విద్య కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. 8లో▸




సాగు నీరు.. వాగు పాలు!
కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు గండ్లు, బుంగలు పడటంతో సాగు నీరు వృథాగా పోతోంది. 8లో▸



పేరుకే ఎంపీటీసీలు
నిధులు లేక ఎంపీటీసీలు సతమతమవుతున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

డెలి'వర్రీ'..!

ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రసవాలు
- సిజేరియన్లకే మొగ్గు చూపుతున్న క్లినిక్‌లు
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- ముహూర్తాలు చూసుకొని ప్రసవాలు చేయిస్తున్న కుటుంబ సభ్యులు
- పట్టించుకోని వైద్యారోగ్యశాఖ



పరిగి: రిస్క్, హైరిస్క్ ఉన్న సందర్భాల్లో మాత్రమే ఆపరేషన్ ద్వారా ప్రసవాలు చేయాలన్న నిబంధనలు ఉన్నా ప్రైవేటు ఆస్పత్రులు పట్టించుకోవడం లేదు. చట్ట విరుద్ధంగా శస్త్ర చికిత్సలు చేసి లక్షల్లో దండుకుంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మాతాశిశు ఆరోగ్యం కోసం సాధారణ ప్రసవాలు ఎంతో మేలని చెబుతున్నా ప్రైవేట్ క్లినిక్‌లు పెడచెవిన పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో అత్యధిక ఆపరేషన్లతో ప్రసవాలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై వైద్య ఆరోగ్య శాఖ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. ఆ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి ప్రైవేట్ క్లినిక్‌లను సందర్శించి శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవాలు ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు అధికం

జిల్లా వ్యాప్తంగా ప్రసవాలు చేసే ప్రైవేటు ఆస్పత్రులు 33 వరకు ఉన్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి 2024 జనవరి వరకు ప్రైవేట్ క్లినిక్‌లో సాధారణ ప్రసవాలు 480 జరిగితే, సిజేరియన్లు 2,600పైగా జరిగాయి. ఇదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు 5,499 కాగా, సిజేరియన్లు 2,600 జరిగాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తరచూ వైద్యులతో సమావేశాలు నిర్వహించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశిస్తున్నారు. ప్రైవేట్ క్లినిక్‌లపై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల (ప్రోగ్రాం ఆఫీసర్ల)ను నియమించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా, ఇక్కడే ప్రసవాలు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌పై ఉంటుంది. కానీ పేరుకే ప్రోగ్రాం ఆఫీసర్ అన్నట్లు తయారైంది. ప్రతి నెలా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించి వాటిలో ఎన్ని సాధారణ, సిజేరియన్ ప్రసవాలు జరిగాయన్న వివరాలు సేకరించాలి. నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ చేసిన వైద్యులు, క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి. అయితే ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ముహూర్తం కోసం..

సాధారణంగా నెలలు నిండి, నొప్పులు వచ్చిన సమయంలోనే ప్రసవం చేస్తుంటారు. కానీ కొంత మంది కుటుంబ సభ్యులు తిథి, నక్షత్రం చూసుకొని ఈ సమయంలో పిల్లలు పుడితే మంచిదని భావిస్తున్నారు. నిర్ణయించి సమయంలో ఆపరేషన్ చేయాలని వైద్యులకు సూచిస్తున్నారు. ఈ కారణంగానే ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నట్లు సమాచారం.

సాధారణ ప్రసవాలను కూడా..

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణుల్లో రిస్క్, హైరిస్క్ ఉన్న వారికి మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేస్తున్నారు. కానీ ప్రైవేటు క్లినిక్‌లలో మాత్రం సాధారణ ప్రసవం జరిగే అవకాశం ఉన్నా డబ్బు కోసం సిజేరియన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా నార్మల్ డెలివరీ జరిగితే వచ్చే ఫీజు చాలా తక్కువ, సిజేరియన్ అయితే రూ.70 వేల నుంచి రూ. లక్ష వరకు వస్తుంది. ఈ కారణంగానే ప్రైవేటు క్లినిక్‌లు శస్త్రచికిత్సలకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్య శాఖ ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం



రిస్క్, హైరిస్క్ ఉన్న సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేయాలి. డబ్బు కోసం సాధారణ ప్రసవాలను కూడా సిజేరియన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం. నిబంధనలు పాటించని ఆస్పత్రులు, వైద్యులపై చర్యలు తీసుకుంటాం.

– పల్వాన్ కుమార్, జిల్లా వైద్యాధికారి



తాండూరులో ఎండ తీవ్రతకు రోడ్డుపై కనిపించని జనం

భానుడి ఉగ్రరూపం

- వేసవికి ముందే మండుతున్న ఎండలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- జిల్లాలో 34 నుంచి 36 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

తాండూరు: వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.సాధారణంగా శీతాకాలంలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతాయి. కానీ ఈ సీజన్‌లో చలి అంతగా ప్రభావం చూపడం లేదు. ఎండలు మాత్రం దంచి కొడుతున్నాయి. వేసవికి పక్షం రోజుల ముందే భానుడు ఉగ్ర రూపం దాల్చాడు. ప్రతి ఏటా శివరాత్రి తర్వాత ఎండలు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం వేసవి కాలాన్ని తలపిస్తోంది. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రానున్న వేసవిలో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 36 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఈ నెల చివరి నాటికి మరో నాలుగు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. గురువారం జిల్లాలోని బంట్వారం, మర్పల్లి మండలాల్లో 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.కనిష్ట ఉష్ణోగ్రతలు 20 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. తాండూరు ప్రాంతంలో 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వాతావరణం మార్పులతోనే..



వాతావరణంలో ఏర్పడిన మార్పులతోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జిల్లాలో ప్రతి ఏటా 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలల్లో 45 డిగ్రీలకు పైగా నమోదయ్యే అవకాశం ఉంది.

– సుధాకర్ చౌరట్, ప్రధాన శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూరు

న్యూస్‌రీల్

వృక్ష సంపదను కాపాడుకుందాం
అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్

వికారాబాద్ అర్బన్: భవిష్యత్ తరాల కోసం వృక్ష, జంతు సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్న వేళ అడవుల్లో అగ్గి రాజుకోవడం సాధారణమని, దాని నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రధానంగా గడ్డి భూములు ఎక్కువగా ఉండటంతో ఫారెస్ట్ ఫైర్‌కు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతగిరి, దామగుండం, తిప్పాపూర్, మోత్కుపల్లి అడవుల్లో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తాయని పేర్కొన్నారు. ఫారెస్ట్ ఫైర్ వల్ల చిన్న చిన్న జంతువులు, కుందేళ్లు, పక్షులు, కీటకాలకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. వాటికి గడ్డి లభ్యత తగ్గి ఇబ్బంది పడతాయన్నారు. చిన్న సైజులో ఉన్న మొక్కలు సైతం పూర్తిగా కాలిపోయే అవకాశం ఉందన్నారు. ప్రపంచ గణాంకాల ప్రకారం 95శాతం అడవులు మానవ తప్పిదాలతోనే కాలిపోతున్నాయని,మిగిలిన 5శాతం మాత్రమే సహజ కారణాల వల్ల తగలబడుతున్నాయని తెలిపారు. బీడీ, సిగరెట్ తాగి పారేయడం, అటవీ ప్రాంతంలో వంట చేసుకోవడం వంటివి వాటి కారణంగా ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రజలు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వృక్ష, జంతు సంపదను కాపాడినవారవుతారని తెలిపారు. అటవీ ప్రాంతంలో అగ్గి రాజేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు బండల ఎల్లమ్మ రథోత్సవం

కొడంగల్: పట్టణ శివారులో వెలిసిన బండల ఎల్లమ్మ రథోత్సవం శుక్రవారం సాయంత్రం జరగనుంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనాలు, నైవేద్యం సమర్పణ, సాయంత్రం రథోత్సవం, శనివారం సాయంత్రం ఎద్దుల ఊరేగింపు, ఆదివారం సాయంత్రం పెరుగు బసంతం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు
ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



రాకంచర్లలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరైనట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రాకంచర్ల, తిర్మలాపూర్ పంచాయతీల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే ప్రతి పంచాయతీకి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వచ్చే నెల నుంచి మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, నాయకులు పెంటయ్య, రాములు, గోపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పని చేయాలి



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న డీకే అరుణ

కొడంగల్: దేశం కోసం.. ధర్మం కోసం.. ప్రతి ఒక్కరూ పని చేయాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర గురువారం కొడంగల్ చేరుకుంది. అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలనుద్దేశించి వారు మాట్లాడారు. ప్రధాని మోదీకి ముచ్చటగా మూడో సారి అధికారం ఇవ్వాలన్నారు. ఆయన ఆధ్వర్యంలో దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. కరోనా కష్టకాలంలో దేశ ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్, రేషన్ ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ కీర్తిని చాటారని కొనియాడారు. హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిని గెలిపించి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న పరీక్షలపై గురువారం ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉంటాయని తెలిపారు.ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 310 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 13,412 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు ఉంటాయని, ఇందుకోసం జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఫస్ట్, సెకెండ్ ఇయర్‌లకు సంబంధించి 16,823 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రశ్న పత్రాలను భద్రపరిచేందుకు పది పోలీస్ స్టేషన్లను గుర్తించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష ముగిసే వరకు జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదని ఆదేశించారు. కాపీయింగ్ జరిగినట్లు సమాచారం అందితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్డీవో విజయకుమారి, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఎస్ శంకర్ నాయక్, డీఈఓ రేణుకాదేవి,డీఎంహెచ్‌ఓ పాల్వన్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్పీ జయరాజ్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌చార్జ్ మనోహర్‌దాస్, డీటీఓ జస్వంత్ కుమార్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి సమాయత్తం

- ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- అర్హుల నుంచి ఆధార్, రేషన్ కార్డు వివరాలు సేకరిస్తున్న సిబ్బంది
- జిల్లా వ్యాప్తంగా 1.40 లక్షల మంది లబ్ధిదారులు



లబ్ధిదారుల నుంచి రేషన్ కార్డులు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది

తాండూరు: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అమలుకు విద్యుత్ శాఖ సమాయత్తమవుతోంది. జిల్లాలో 20 మండలాలు, 565 గ్రామ పంచాయతీలు, 330 అనుబంధ గ్రామాలు, 2,26,668 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. తాండూరు డివిజన్ పరిధిలో 1,01,653 కనెక్షన్లు ఉండగా వికారాబాద్ పరిధిలో 1,25,015 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకం అమలుకు తెల్ల రేషన్ కార్డు ఉన్న వారిని అర్హులను ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో విద్యుత్ శాఖ అధికారులు గ్రామాలు, పట్టణాల వారీగా 200 యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. అలాంటి వారి నుంచి ఆధార్, రేషన్ కార్డులు సేకరిస్తున్నారు. అందుబాటులో లేని వారి ధ్రువీకరణ పత్రాలను కూడా సేకరించే పనిలో నమగ్నమయ్యారు.

గృహజ్యోతి పరిధిలోకి 1.40 లక్షల కనెక్షన్లు

పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది.అందుకోసం విద్యుత్ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా 1.40లక్షల కుటుంబాలను అర్హులుగా గుర్తించారు.పట్టణ ప్రాంతాల్లో అద్దె నివాసం ఉండే కుటుంబాలకు రేషన్ కార్డు ఆధారంగా గృహలక్ష్మి పథకం అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పథకం అమలుకు 2.80 కోట్ల యూనిట్ల వరకు విద్యుత్ అవసరం అవుతుంది.

ఏటా బిల్లుల రూపంలో రూ.133 కోట్లు

జిల్లాలో విద్యుత్ శాఖకు ప్రతి ఏటా అన్ని విభాగాల ద్వారా బిల్లుల రూపంలో రూ.133 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ప్రధానంగా కమర్షియల్, పరిశ్రమలు, వాటర్ వర్క్స్ తోపాటు పలు రకాల కనెక్షన్ల ద్వారా ఆదాయం వస్తోంది. ప్రస్తుతం గృహ వినియోగదారులకు 50 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగిస్తే యూనిట్‌కు రూ. 1.95 చొప్పున వసూలు చేస్తున్నారు. 100 యూనిట్ల లోపు అయితే యూనిట్‌కు రూ.3.10 చొప్పున వసూలు చేస్తున్నారు.101 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగిస్తే యూనిట్‌కు రూ.4.80 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే ఉచిత విద్యుత్ అమలు చేస్తే ప్రతి నెలా విద్యుత్ శాఖకు రూ.5 కోట్ల వరకు భారం పడనుంది.

'చెత్త' సేకరణ

రెండు రోజులకు ఒక్కసారి ఇళ్ల వద్దకు చెత్త ఆటోలు
- వెంటాడుతున్న వాహనాలు, సిబ్బంది కొరత
- తడి, పొడి అంతా ఒకేచోట
- ఇబ్బందుల్లో ప్రజలు



తడి, పొడి చెత్తను ఒకే ఆటోలో వేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపాలిటీలో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. చెత్త తీసుకెళ్లేందుకు రోజు వార్డుకు రావాల్సిన ఆటోలు రెండు మూడు రోజులకు ఒక్కసారి కూడా రావడం లేదు. దీంతో ఆయా వార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారేస్తున్నారు. వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా చెత్త సేకరణకు సరిపడా వాహనాలు, పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పట్టణ ప్రజలు అంటున్నారు. పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతున్నా పారిశుద్ధ్య రంగంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో పాలకవర్గం వెనుకబడి పోతుందనే విమర్శలు ఉన్నాయి.

చెత్త సేకరణకు తీవ్ర ఇబ్బందులు

వికారాబాద్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు వాహనాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 34వార్డుల్లో రోజుకు 32 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. ప్రస్తుతం చెత్త తరలించడానికి కేవలం 15 ఆటోలు, 6 ట్రాక్టర్లు ఉన్నాయి. ఈ ఆరు ట్రాక్టర్లు ప్రధాన రోడ్ల వెంట చెత్త సేకరించడంతో పాటు, మున్సిపాల్టీలో రోజు జరిగే ఆయా కార్యక్రమాలకే సరిపోతాయి.ఇక 15 ఆటోలు మాత్రమే 34 వార్డుల్లో చెత్త సేకరణ చేయాలి. ఒక ఆటో రెండు వార్డుల్లో చెత్త సేకరించాలంటే ఒక ఇంటికి నాలుగు రోజులకు ఒక సారి ఆటో వస్తుంది. ఈ 15 ఆటోల్లో కూడా రోజు రెండు మూడు ఆటోలు చెడిపోతుండటం పారిశుద్ధ్య సిబ్బందికి ఇబ్బందిగా మారింది. సకాలంలో ఆటోలు రాకపోవడంతో చాలా మంది చెత్తను ఆరుబయటే పారేస్తున్నారు.శివారు వార్డుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది.శివారు వార్డులకు కనీసం చెత్త సేకరణ ఆటోలు వెళ్లకపోగా, పారిశుద్ధ్య సిబ్బంది కూడా అటు తొంగి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

తడి, పొడి అంతా ఒకచోటే

మున్సిపాలిటీలో చెత్త సేకరణకు అవసరమయ్యే వాహనాల కొరతతో అనుకున్న ఆశయం నీరుగారిపోతోంది. వాహనాల కొరత కారణంగా ఇంటింటికి వెళ్లి సేకరించడం కష్టంగా మారుతోంది. ఫలితంగా తడి, పొడి అంటూ వేర్వేరు కాకుండా అంతా ఒకే వాహనంలో వేసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.ఫలితంగా వ్యర్థానికి అర్థం లేకుండా పోతోంది. వికారాబాద్ పురపాలికలో వాహనాల లేమి కారణంగా చెత్త సేకరణలో తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒకే ఆటో రెండు వార్డుల్లో చెత్త సేకరించాల్సి వస్తుంది. ఈ కారణంగా తడి, పొడి చెత్త సేకరణ పూర్తిగా నీరుగారిపోతోంది. కొందరు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తున్నా పారిశుద్ధ్య సిబ్బంది ఆటోలో ఒకేచోట వేసుకొని పోతున్నారు.

పారిశుద్ధ్యంపైనే ప్రధాన ఖర్చు

ప్రతినెలా పారిశుద్ధ్యంపైనే అత్యధికంగా ఖర్చు చేస్తున్నారు. మున్సిపాలిటీలో 153 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా వేతనాల రూపంలో రూ.19,56,000 వెచ్చిస్తున్నారు. 15ఆటోలకు, 6ట్రాక్టర్లకు రూ. 4నుంచి రూ. 5లక్షల వరకు డీజిల్ ఖర్చు వస్తోంది. ఇవి కాకుండా బ్లీచింగ్ పౌడర్, లైనింగ్ సున్నం తోపాటు, కార్మికులకు అవసరమైనా సామగ్రికి ప్రతి నెలా కొంత ఖర్చు చేయాల్సి వస్తోంది. వాహనాల చిన్నచిన్న మరమ్మతులకు కలిపి మరో రూ.50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన ప్రతినెలా సుమారు రూ.25లక్షల వరకు పారిశుద్ధ్య నిర్వాహణకు వెచ్చిస్తున్నారు.

కార్మికుల కొరత

మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, 85వేల జనాభా ఉంది. కార్మికుల కొరత మాత్రం తీవ్రంగా ఉంది. ప్రస్తుతం పారిశుద్ధ్య విభాగంలో 153మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ సంఖ్య ఏమాత్రం సరిపోదని అధికారులు అంటున్నారు. విలీనమైన వార్డులు ప్రధాన పట్టణానికి దూరంగా ఉండటంతో కార్మికులు విలీన గ్రామాలకు వెళ్లి రావడానికే సమయం పడుతోంది. ప్రధాన పట్టణానికి విలీన గ్రామాలు 3 నుంచి 9 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడి స్థానికులనే కార్మికులుగా పెట్టుకుంటే కొంత సమస్య తీరే అవకాశం ఉంది. కొత్త ప్రభుత్వమైనా మున్సిపాలిటీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, అలాగే పారిశుద్ధ్య సిబ్బందితోపాటు చెత్త సేకరణకు వాహనాలు సమకూర్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు
తహసీల్దార్ ఆనంద్‌రావు

పరిగి: తుంకలగడ్డలో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆనంద్‌రావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన తుంకలగడ్డలో పర్యటించి నూతన నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం ఇక్కడ అసైన్డ్ పట్టాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వగా మిగిలిన వంద ఎకరాల భూమి ఆక్రమణకు గురైందన్నారు. వాటిని గుర్తించడానికే ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. నూతనంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు నిలిపి వేయాలని సూచించారు. నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

క్లుప్తంగా

రమేశ్ మహరాజ్‌కు ఘన సన్మానం



రమేశ్ మహరాజ్‌ను సన్మానించిన నాయకులు

తాండూరు: స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా నియమితులైన రమేశ్ మహరాజ్‌ను పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం తాండూరుకు వచ్చిన ఆయన్ను కాంగ్రెస్ నాయకులు, బీసీ, ముదిరాజ్ సంఘాల నాయకులు, తాండూరు వ్యాపారులు కలసి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్ రమేశ్ మహరాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి రాజ్‌కుమార్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద స్కాలర్‌షిప్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి డి.సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు ఒకటి నుంచి 2023 డిసెంబర్ 31 వరకు విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ తీసుకున్న వారు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. అర్హత గల వారు 2024 మార్చి 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న పత్రాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440685713ని సంప్రదించాలన్నారు.

కూతుర్ని వేధిస్తున్నాడని..

- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
- యువకుడిపై కేసు నమోదు

యాలాల: ఓ యువకుడు తన కూతురిని వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన తండ్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన యాలాల మండలం బెన్నూరులో వెలుగుచూసింది. యాలాల ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అమృతప్ప కూలిపనులు చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అమృతప్ప ఆత్మహత్యకు అదే గ్రామానికి చెందిన నవీన్ అనే యువకుడు కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తన కూతురిని ప్రేమ పేరుతో నవీన్ తరుచూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన అమృతప్ప ఆత్మహత్యకు పాల్పడ్డాడని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం తాండూరు రూరల్ సీఐ అశోక్‌కుమార్ గ్రామంలో పర్యటించి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

పాంబండ ఆలయంలో వేలం పాట



టెంకాయల వేలం నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో గురువారం వేలం పాట నిర్వహించారు. టెంకాయల విక్రయానికి సంబంధించిన వేలాన్ని రూ.5,51,00 బి.ప్రసాద్, తలనీలాలు తీసే వేలాన్ని రూ.2,67,000 అంగుకూరు పోలేరు దక్కించుకున్నారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31 వరకు వేలం చెల్లుబాటవుతుందని ఈఓ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నర్సమ్మరాములు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు, అర్చకులు దశరథం, పాండు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భవనం పూర్తయ్యేనా?

నత్తనడకన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు

- వచ్చే విద్యాసంవత్సరానికి కూడా పూర్తికాని పరిస్థితి
- ఆన్‌లైన్‌లోనే క్లాసులు వింటున్న విద్యార్థినులు
- అద్దె భవనంలోనైనా తరగతులు నిర్వహించాలని తల్లిదండ్రుల డిమాండ్



నిర్మాణ దశలో నర్సింగ్ కళాశాల

తాండూరు టౌన్: తాండూరు పట్టణం విద్యా సౌకర్యాల్లో ఎంతో వెనుకబడి ఉంది. ఇంజనీరింగ్, బీఈడీ, టీటీసీ తదితర కోర్సులు చేయాలంటే ఇక్కడి విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తాండూరు ప్రాంతానికి నర్సింగ్ కళాశాల మంజూరవడంతో పాటు కళాశాల భవన నిర్మాణానికి గాను నిధులు కూడా మంజూరు చేశారు. అయితే నిర్మాణ పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికైనా నిర్మాణం పూర్తవుతుందో లేదో అని అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ శివారులోని..

తాండూరు పట్టణ శివారులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం పక్కనే ఉన్న మూడెకరాల్లో రూ.19 కోట్ల నిధులతో ఆరునెలల క్రితమే నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇక్కడ తరగతి గదులతో పాటు, నర్సింగ్ విద్యార్థినుల కోసం హాస్టల్ భవన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంది. నర్సింగ్ కళాశాల మంజూరైన వెంటనే 2023–24వ విద్యా సంవత్సరానికి సంబంధించి 60 మంది విద్యార్థినులకు అడ్మిషన్లు కూడా ఇచ్చారు. భవన నిర్మాణం త్వరగానే పూర్తవుతుందని అంతా అనుకున్నప్పటికీ పనులు ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. నర్సింగ్ కోర్సులో చేరిన విద్యార్థినులకు తరగతులు నిర్వహించేందుకు కనీసం అద్దె భవనాన్ని కూడా కేటాయించలేదు. దీంతో చేసేదిలేక ఇంటి వద్దనే ఉంటూ విద్యార్థినులు ఆన్‌లైన్‌లో క్లాసులు వింటున్నారు. అసలే నర్సింగ్ కోర్సు.. దానికి తోడు ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణతో విద్యార్థినులకు ఇబ్బందిగా మారింది. భవనాన్ని అద్దెకు తీసుకుని నేరుగా తరగతులు నిర్వహించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

పిల్లర్ల దశలోనే..

నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై ఆరునెలల గడుస్తున్నా ఇంకా పిల్లర్ల దశలోనే నిర్మాణం ఉండటం గమనార్హం. ఇలా పనులు కొనసాగుతూ పోతే వచ్చే విద్యా సంవత్సరంలో కూడా భవనం పూర్తి కాకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవ తీసుకుని భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ప్రస్తుతానికి అద్దె భవనాన్ని కేటాయించి వచ్చేనెల నుంచి భౌతికంగా తరగతులు జరిగేలా చూడాలంటున్నారు.

వచ్చే ఏడాదికి కష్టమే



నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు ఆరునెలలుగా కొనసాగుతున్నాయి. వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీచేస్తాం. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తవడం మాత్రం కష్ట సాధ్యమే.

– సురేందర్ రెడ్డి, ఎస్‌ఈ

భౌతిక క్లాసులు నిర్వహిస్తాం



ప్రస్తుతం విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చాం. వారంతా ఇంటి వద్దనే ఆన్‌లైన్‌లో పాఠాలు వింటున్నారు. మైనార్టీ బాలుర గురుకుల భవనాన్ని నర్సింగ్ కళాశాల కోసం తాత్కాలికంగా కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే భౌతికంగా తరగతులు నిర్వహిస్తాం.

– విజయరాణి, ప్రిన్సిపాల్, నర్సింగ్ కళాశాల



గట్టెపల్లి గ్రామ సమీప చెక్‌డ్యాంలోకి చేరిన ప్రాజెక్టు ఎడమ కాల్వ నీరు

సాగు నీరు.. వాగు పాలు!

- కోట్‌పల్లి కుడి, ఎడమ కాల్వలకు గండ్లు, బుంగలు
- 30శాతం మేర కాగ్నాలో కలుస్తున్న ప్రాజెక్టు నీరు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు పడిన గండ్లు, బుంగల కారణంగా సాగు నీరు వృథాగా పోతోంది. ఎడమ కాల్వ నుంచి పారాల్సిన నీరు మేకలోని వాడుకలోకి వెళ్లి అక్కడి నుంచి గట్టెపల్లి చెక్ డ్యామ్‌లోకి చేరుతోంది. ఇక్కడి నుంచి కాగ్నా నదిలో పారుతూ నిరుపయోగమవుతోంది. అలాగే కుడి కాల్వకు పడిన గండ్ల ద్వారా నాగసముందర్ సమీప ఊటవాగులోకి చేరి కాగ్నా పాలవుతోంది. ఇలా ప్రాజెక్టు నుంచి వదిలిన నీటిలో సుమారు 30శాతం వరకు వాగులో కలుస్తోంది. ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.140 కోట్లతో అంచనాలు తయారు చేయించామని, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇటీవలే అసెంబ్లీ ప్రస్తావించిన విషయాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు. వెంటనే నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలపై సన్నాహక సమావేశం

దోమ: ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మంజుల, ఎస్‌ఐ ఆనంద్ కుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 28 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మండల కేంద్రంలో ఒకే సెంటర్ ఉన్నందున అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులు సమయ పాలన పాటిస్తూ, ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

అంగన్‌వాడీ హామీలను నెరవేర్చాలి

- 26న కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



నూతన కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకులు

తాండూరు టౌన్: ఎన్నికల సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తాండూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనంగా రూ.25 వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాండూరు కమిటీకి ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం.బాలమణి, ప్రధాన కార్యదర్శి బేబి, ఉపాధ్యక్షురాలు జయంతి, లలిత, రామానుజమ్మ, రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా సుజాత, అంజమ్మ, మణిమాల, లక్ష్మి, సరస్వతి, శోభ, వాణి, కోశాధికారులుగా శశికళ, చంద్రకళను నియమించుకున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల



విద్యార్థికి బహుమతి ఇస్తున్న సంస్థ నిర్వాహకులు

దోమ: సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు ఎంతో అవసరమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అన్నారు. గతేడాది డిసెంబర్‌లో పరిగి పట్టణంలో సాఫ్ట్‌లైన్ కంప్యూటర్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి సత్తాచాటారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొనగా ఆంగోత్ అనిల్ తాలుకాలో మొదటి స్థానంలో రాగా, మరి కొంత మంది విద్యార్థులు ఆయా స్థానాలకు పరిమితం అయ్యారు. ఈ మేరకు గురువారం సంస్థ నిర్వాహకులు ఆంజనేయులు కళాశాలలో విద్యార్థికి కంప్యూటర్‌ను బహుమతిగా అందజేశారు. మిగతా విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, మెమోంటోలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా ఎంతో అనుభవం కలుగుతుందన్నారు. నేటి ఆధునిక కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం చాలా పెరిగిందని, అందుకు ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధ, శ్రీధర్, రాములు, శ్రీవిద్య, లక్ష్మయ్య, సునీత, మధుసూధన్, సువర్ణ, హరికృష్ణ, సురేశ్, గోవిందా ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న నవీన్

యాలాల: ఉరుకుల పరుగుల జీవితంలో మానసికంగా ప్రశాంతంగా ఉండాలంటే ధ్యానమే సరైన మార్గమని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముద్దాయిపేట, పగిడియాల, అచ్యుతాపూర్, బాగాయిపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలు, పాఠశాలల విద్యార్థులకు ధ్యాన ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ధ్యాన ప్రసారకర్త నవీన్ మాట్లాడుతూ.. ధ్యానంతో సర్వ రోగాలు దూరమవుతాయన్నారు. గుండెజబ్బు, బీపీ, షుగర్ తదితర వ్యాధులు తగ్గేందుకు ధ్యాన ప్రక్రియ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరిగి చదువులో రాణించగలరన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు వేణు, బాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన మహమ్మద్ ఆజాద్(34) బతుకుదెరువుకు మొయినాబాద్‌కు వచ్చాడు. ఈనెల 16న గండిపేట చౌరస్తా సమీపంలోని మెలోహా స్కూల్ వద్ద ఆజాద్ రోడ్డు దాటుతుండగా ఓ బైక్ అతడిని వేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతన్ని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తగలబడిపోతున్నా పట్టించుకోరా?

దామగుండం పరిరక్షణ సమితి సభ్యులు

పూడూరు: వన్యప్రాణులకు నిలయంగా మారిన దామగుండం అటవీ ప్రాంతం తగులబడిపోతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని సత్యానంద స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా అటవీ ప్రాంతంలో అక్కడక్కడ గుర్తుతెలియని వ్యక్తులు తగుల బెడుతున్నారన్నారు. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం మరోసారి అడవిలో నిప్పు రాజేశారన్నారు. చెట్లు, పశుగ్రాసంతో పాటు వన్యప్రాణులు మంటల్లో కాలిపోతున్నాయన్నారు. ఆహ్లాద వాతావరణం ఉన్న వికారాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి పేరిట నాశనం చేయకూడదన్నారు. నేవీ రాడార్ ఏర్పాటుతో పశు, పక్షాదులకు తీరని నష్టం వాటిల్లడంతో పాటు రేడియేషన్ వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. గత పక్షం రోజులుగా అడవి తగులబడిపోతున్నా ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదని దామగుండం పరిరక్షణ సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు స్పందించి అటవిని కాపాడాలని కోరారు.



అడవిని పరిశీలిస్తున్న సమితి సభ్యులు

పెంటతండాలో చోరీల కలకలం

- ఒకేరోజు మూడు ఇళ్లలో బంగారం, నగదు అపహరణ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాలో బుధవారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. ఆమనగల్లు ఎస్‌ఐ బల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. పెంటతండాకు చెందిన ఇస్లావత్ సునీత భర్త రఘురాం బుధవారం పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లడంతో సాయంత్రం భోజనం చేసిన సునీత కుటుంబ సభ్యులతో కలిసి పక్కనే ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించింది. ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఇంటిలోపల బీరువాలో ఉన్న 9 గ్రాముల బంగారు నగలు, 20 తులాల వెండి గొలుసు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించింది. అలాగే తండాకు చెందిన జటావత్ మల్యా, ఇస్లావత్ మల్యాల ఇంటి తాళాలను పగులకొట్టిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయారు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పెంటతండాలో చోరీకి గురైన ఇళ్లను ఎస్‌ఐ బాల్‌రాం గురువారం పరిశీలించి వివరాలు సేకరించారు. ఇటీవలే కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాలో ఒకేరోజు రాత్రి ఐదు ఇళ్లలో దొంగతనం జరిగిన విషయం మరువకముందే తాజాగా పెంటతండాలో అదే తరహాలో చోరీకి పాల్పడ్డారు.

రహదారులకు పచ్చ తోరణం

సత్ఫలితాలిస్తోన్న పల్లె ప్రగతి

- యాచారంలో కనువిందు చేస్తున్న పచ్చని చెట్లు
- సేదతీరుతున్న వాహనదారులు, స్థానికులు



చింతుల్ల వెళ్లే రోడ్డులో పచ్చటి తోరణంలా పెరిగిన చెట్లు

యాచారం: గ్రామాలోంని పచ్చని చెట్లు స్వాగత తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. యాచారం మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా పచ్చని చెట్లు దర్శనమిస్తుండటం ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. నాటి ఎంపీడీఓ వినయ్‌కుమార్ పట్టుదల, శ్రమ, కృషి ఫలితమే నేడు గ్రామాల్లోని రహదారులన్నీ పచ్చని తోరణాలుగా కనిపిస్తున్నాయి. పర్యావరణ, పరిరక్షణ కోసం గత బీఆర్‌ఎస్ సర్కార్ పల్లె ప్రగతిలో భాగంగా హరిత హారం ద్వారా చెట్లు నాటే కార్యక్రమాన్ని చాలెంజ్‌గా తీసుకుంది. అందులో భాగంగానే 4వ విడత పల్లె ప్రగతి పథకంలో యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో దాదాపు 3 లక్షలకు పైగా మొక్కలు నాటారు. ప్రతి గ్రామానికి 10వేల నుంచి 15వేలకు తగ్గకుండా పలు రకాల మొక్కలు నాటారు. ఇందులో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు అందరినీ భాగస్వాములు చేశారు.

కడియం నుంచి మొక్కలు...

పల్లె ప్రగతిలో భాగంగా రహదారుల వెంట నాటిన మొక్కలకు సంబంధించి పంచాయతీలకు ట్రీగార్డు ఖర్చు లేకుండా మేకలు, పశువుల నుంచి రక్షణ ఉండటం కోసం నాటి ఎంపీడీఓ వినయ్‌కుమార్ కడియం నుంచి 12 నుంచి 14 అడుగుల ఎత్తున్న పలు రకాల మొక్కలు తెప్పించి పంచాయతీలకు సరఫరా చేశారు. ఆ మొక్కలు నేడు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో చెట్లుగా ఎదిగి పచ్చని తోరణాలుగా కనువిందు చేస్తున్నాయి. రోడ్డు మధ్యలోని డివైడర్‌లో కాకుండా రోడ్డుకిరువైపులా నాటడంతో అవి ఏపుగా పెరిగి రోడ్డుకిరువైపులా నీడను ఇస్తున్నాయి. దుకాణాల వద్ద, ఇండ్ల వద్ద నాటిన మొక్కలు నేడు చిరువ్యాపారులకు, దుకాణ యజమానులకు చల్లని నీడను ఇస్తున్నాయి. చెట్ల కిందనే చిరు వ్యాపారులు పలు రకాలు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఉన్న యాచారం, మాల్ కేంద్రాల్లో డివైడర్ మధ్యలో నాటిన మొక్కలు రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఎంతో కనివిందు చేస్తున్నాయి.

24 గ్రామ పంచాయతీల్లో..

4వ విడతలోనే పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని నాటి కేసీఆర్ సర్కార్ భావించింది. ఇందులో భాగంగా గ్రామాల్లోని ప్రభుత్వ, వెంచర్లల్లో ఎంపిక చేసిన ఖాళీ స్థలాల్లో ఒకేచోట 500 నుంచి వెయ్యి మొక్కలు నాటారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలతో పాటు మరో నాలుగు అనుబంధ గ్రామాల్లో కూడా పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. నాడు నాటిన మొక్కలు ఇప్పుడు చెట్ల రూపంలో దర్శనమిస్తున్నాయి. వాటిలో పలు రకాల పండ్ల మొక్కలు కూడా ఉండటంతో అవి పంచాయతీలకు ఆదాయాన్ని కూడా ఇస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కల సంరక్షణలో కూడ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగింది. రహదారుల్లోనే కాకుండా గ్రామాల్లో, కాలనీల్లోని రోడ్డు వెంట నాటిన మొక్కలు నేడు చెట్లుగా ఎదిగి గ్రామాల్లో ప్రజలకు చల్లటి నీడను ఇస్తున్నాయి.

సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు



మొక్కల సంరక్షణపై పంచాయతీలు నిర్లక్ష్యం చేయొద్దు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో వారానికోమారు చెట్లకు నీళ్లు పోస్తేనే జీవిస్తాయి. ఏ గ్రామానికి వెళ్లినా పచ్చని చెట్లు కనివిందు చేస్తున్నాయి. సంరక్షణ చేస్తే భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణతో పాటు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

మినీ మేడారంలా ఎల్లమ్మ జాతర

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

బొంరాస్‌పేట: ఎల్లమ్మ జాతరను మినీ మేడారంలా నిర్వహించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గంలోని దుద్యాల మండలం పోలెపల్లిలో ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీనిపై సీఎంతో చర్చిస్తానని చెప్పారు. బుగ్గప్ప, వెంకట్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

మా ఇంటి దేవత

'మా ఇంటి దేవత ఎల్లమ్మ' అంటూ స్పీకరు గడ్డంప్రసాద్‌కుమార్ గుర్తుచేశారు. అమ్మమ్మ ఊరు పోలెపల్లి కావడం, స్పీకరుగా పదవి పొందడంతో దర్శించుకున్నారు. ప్రసాద్‌కుమార్ తల్లి అంబటి అలియాస్ కోస్గి ఎల్లమ్మ కుటుంబం. ఆయన మేనమామలు కోస్గి బాలప్ప, నర్సప్ప, బసప్పల గ్రామం కావడంతో ఆత్మీయత, భక్తిభావం ఉందన్నారు. మంగళవారం కోస్గి సభలో సీఎం కడా అధికారి వెంకట్‌రెడ్డి, మేనేజరు రాజేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ ముచ్చటి వెంకటయ్య, నూతన కమిటీని అభినందించారు.